
మురిసిన భవిత


మెరిసిన యువత

అమరపురి.. సృజన సిరి..



ఘనంగా రెండు రోజుల డ్రోన్ సమ్మిట్

ఆశ్చర్యపరిచిన ఆధునిక, సాంకేతిక ప్రదర్శనలు

ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి


మంగళగిరిలో రెండో రోజు ప్రదర్శనకు ఉంచిన ఆధునిక డ్రోన్లను చూసి విద్యార్థులు.. గొప్ప అనుభూతికి లోనయ్యారు. తమకు ఇప్పటివరకూ వీటి గురించి ఇంత అవగాహన లేదని.. తొలిసారి ఇలాంటివి చూస్తున్నామని తెలిపారు. తాము కూడా పెద్దయ్యాక డ్రోన్లను తయారుచేస్తామని విద్యార్థులు ఆనందంగా చెప్పారు. ఇవి చూసి ఎంతో స్ఫూర్తి పొందామని, భవిష్యత్తులో డ్రోన్ల విప్లవం రానుందని.. ఇవన్నీ ప్రత్యేక నిదర్శనమని ఇంజినీరింగ్ విద్యార్థులు పేర్కొన్నారు. తాము ఇప్పటికే పొలాల్లో డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయిస్తున్నట్లు కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల రైతులు ఆనందంగా తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయం మరింత పెరిగితే.. రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

రైతన్నకు తోడుగా.. విహార్

ఐఐటీ మద్రాసు విద్యార్థులు, అధ్యాపకుల సహాయంతో 'విహార్' పేరుతో డ్రోన్‌ను తయారు చేశారు. ఐఐటీ ప్రాంగణంలోనే స్టార్టప్ కంపెనీ పెట్టారు. ఈ డ్రోన్‌ను క్రిమిసంహారక మందులు, విత్తనాలు చల్లడానికి వాడవచ్చు. డ్రోన్ కింద అమర్చిన డబ్బాలో మందులను ఉంచి.. పిచికారీ చేయొచ్చు. రైతులు సులభంగా విత్తనాలను కూడా పొలాల్లో చల్లుకోవచ్చు. 30 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌కు.. 10 లీటర్ల ద్రావణం ఒకేసారి పైకి తీసుకెళ్లి పిచికారీ చేసే సత్తా ఉంది. రెండు గంటల్లో 30 ఎకరాలకు పురుగుమందు పిచికారీ చేయగలదు. 100 అడుగుల ఎత్తు ఎగురుతుంది. తమ డ్రోన్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నుంచి టైప్ సర్టిఫికేషన్ ఉందని సంస్థకు చెందిన విఘ్నేశ్ వెల్లడించారు.


విహార్ డ్రోన్

ఈ డ్రోన్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది..



నేను 12 ఎకరాల్లో వరి, మినుము పండిస్తున్నా. ఇటీవల డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయించా. పంపు సెట్లతో కొడితే.. రోజులు పడుతుంది. పనివారూ దొరకడం లేదు. సొంతంగా డ్రోన్ కొంటే.. నాతోపాటు మా ఊరి రైతులకూ ఉపకరిస్తుందనే ఉద్దేశంతో చూసేందుకు ఇక్కడికి వచ్చా. పెట్రోలు, బ్యాటరీతో ఎక్కువ సమయం ఎగిరే డ్రోన్‌ను కొంటా. ఈ డ్రోన్లను చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది.

– వి.నర్సింగరావు, రైతు, గుడివాడ



అమరావతి డ్రోన్ సమ్మిట్ చూసేందుకు విజయవాడ, గుంటూరు సహా చుట్టుపక్కల ప్రాంతాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల రైతులు, ప్రజలు భారీగా విచ్చేసి డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ కృష్ణా తీరంలో తొలి రోజు నిర్వహించిన.. 5,500 డ్రోన్ల ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. రెండో రోజు డ్రోన్ల సాంకేతికత, సమాజ అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశాలపై.. మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్‌లో నిర్వహించిన.. సమావేశాల్లో నిపుణులు పాల్గొని..అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన.. సమ్మిట్‌లో దేశవ్యాప్త సాంకేతిక నిపుణులు వచ్చి తాము రూపొందించిన ఆధునిక డ్రోన్లను ప్రదర్శించి.. ఔరా అనిపించారు.

సర్వైలెన్స్, మ్యాపింగ్‌కు.. సిగ్మా25



'సిగ్మా-25' డ్రోన్ అందరినీ ఆకర్షిస్తోంది. సర్వైలెన్స్, మ్యాపింగ్ సహా పలు అవసరాలకు దీనిని వాడొచ్చు. ఇన్‌డ్రోన్స్ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్ అత్యంత తేలికైంది. కేవలం 3.5 కిలోల కంటే తక్కువ బరువు ఉంటుంది. 50 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పక్కాగా సర్వే చేస్తుంది. రైల్వే ట్రాక్, రహదారులు, వంతెనలు, ఆయిల్, గ్యాస్ రిఫైనరీలు, వ్యవసాయం, గనులు, విపత్తులు, టెలీకమ్యూనికేషన్, నిర్మాణం, స్మార్ట్ సిటీల నిర్వహణ వంటి అన్ని అవసరాలకూ వాడవచ్చు. ఈ డ్రోన్‌లో పగలు, రాత్రీ అత్యంత నాణ్యమైన వీడియోలను రికార్డుచేసే అత్యాధునిక కెమెరా అమర్చారు. బహిరంగ సభలు, ఉత్సవాల నిర్వహణకూ వాడవచ్చు.


రైతులకు, గిరిజనులకు భరోసా...





పెనమలూరు కుర్రాడు **శామ్యూల్** ప్రభుత్వ యంత్రాంగానికి ఉపకరించే డ్రోన్ రూపొందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదివి స్వీడన్‌లో కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వదేశానికి వచ్చేసి.. విజయవాడ శివార్లలో డ్రోన్‌హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నెలకొల్పారు. రెండు రకాల డ్రోన్లను రూపొందించారు. ఒకటి అడవులు, కొండగుట్టల్లో ఉండే తండాల్లోని వారికి అత్యంత తేలికగా సరకులు, మందులు సహా ఏ అవసరం ఉన్నా తీసుకెళ్లి ఇచ్చే డ్రోన్. మరొకటి... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఆటోమేటిక్ డ్రోన్. సాధారణంగా పొలానికి పురుగు పడితే.. మొత్తం పంటకు పిచికారీ చేస్తారు. కానీ.. ఎక్కడ పురుగు పట్టిందో ఆ ప్రదేశాన్నే పక్కాగా ఆధునిక కెమెరా, ఏఐ ద్వారా గుర్తించి.. మందును సరిగ్గా అక్కడే ఈ డ్రోన్ పిచికారీ చేస్తుంది. తద్వారా పురుగు మందు వినియోగం సగానికి తగ్గించొచ్చు. ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ల సహకారంతో దీనిని రూపొందించారు.

సాగులో సగం ఖర్చు తగ్గుతోంది..



20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. నాలుగేళ్లుగా పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నా. సాధారణంగా ఇద్దరు మనుషులు రెండు రోజుల్లో 20 ఎకరాలకు మందులు జల్లుతున్నారు. ఒకరికి రోజుకు రూ.500 చొప్పున రూ.2 వేలు ఖర్చు. అదే డ్రోన్‌తో 5 గంటల్లో పని పూర్తయి.. రూ.వెయ్యి వెచ్చిస్తే చాలు. పైగా డ్రోన్‌తో మందుల పిచికారీ చేస్తే వృథా తగ్గుతోంది.

– ఎన్. వెంకటేశ్వరరావు, రైతు, తాడేపల్లి


విద్యార్థికి విజ్ఞానం


డ్రోన్ సమ్మిట్ విజయవంతంగా నడిపించిన బృందాన్ని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

రాచూరు దారికి తాత్కాలిక మరమ్మతు

ఈనాడు కథనానికి స్పందన

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో రాచూరు ప్రధాన రహదారి బురదమయమైంది. దీనివల్ల గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఇదేం దారి.. పడతారు జారి' శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 23న ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. సర్పంచి జయవరపు రాధాకృష్ణమూర్తి ఇటుక రాయి పొడిని తోలించి బురద రహదారిపై పోయించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారిని అందుబాటులోకి తెచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో రహదారి నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.


అభివృద్ధి చేసిన రాచూరు రోడ్డు

కార్తిక సముద్ర స్నానాలకు పటిష్ఠ ఏర్పాట్లు

బాపట్ల, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో సూర్యలంక వద్ద సముద్ర స్నానాలు చేయటానికి వచ్చే భక్తులకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులను కోరారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబుతో కలిసి ఆయన సూర్యలంక తీరంలో బుధవారం పర్యటించారు. భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, స్నానాలు, దుస్తులు మార్చుకోవటానికి టెంట్లతో తాత్కాలిక గదులు, తాగునీరు, మరుగుదొడ్ల వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎవరైనా సముద్ర స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగితే రక్షించటానికి గజ ఈతగాళ్ల సంఖ్యను, సముద్రంలో తిరిగే పడవల సంఖ్యను పెంచాలని చెప్పారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ సూర్యలంక రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీవో ప్రభాకర్, తహసీల్దారు సలీమా, ఎంపీడీవో బాబూరావు, ఈవోపీఆర్డీ శరత్, తెదేపా మండల అధ్యక్షుడు ముక్కామల శివ తదితరులు పాల్గొన్నారు.


సూర్యలంక బీచ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రత్యేక శిబిరాలు పెట్టి ఏంలాభం?

- ఆధార్ నవీకరణలో తప్పని అవాంతరాలు
- సర్వర్ మొరాయించడంతో ప్రజలకు కష్టాలు

న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ఎంతో కీలకమైంది. ఆధార్ నవీకరణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షల మంది ఇంకా దూరంగా ఉన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో పుర కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినా ఆధార్ నవీకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. గంటలు తరబడి వేచి ఉన్నా.. సర్వర్ మొరాయించడంతో తిప్పలు తప్పడం లేదు. జిల్లాలోని 96 సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 64చోట్లే పని చేస్తున్నాయి. మార్పులు చేర్పులు చేయడానికి అక్కడి డిజిటల్ సహాయకులకు ప్రత్యేక శిక్షణ సైతం అందించారు. అప్రమత్తమయ్యారు. వెంటనే సాంకేతిక సిబ్బంది సాయం తీసుకుని కొన్నిచోట్ల సరిచేశారు. మరికొన్ని చోట్ల మాత్రం సమస్య కొనసాగింది. తొలి రోజు అతికష్టం మీద 1170 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెబుతున్నారు. రెండోరోజు గురువారం ఆన్‌లైన్ అవాంతరాలు కొనసాగడంతో ఈ సంఖ్య 633కి పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా కొన్ని ఇబ్బందులు తమ దృష్టికి వచ్చినట్లు వార్డు, గ్రామ సచివాలయల జిల్లా అధికారిణి సువార్త పేర్కొన్నారు. సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు.


చీరాల: సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరం

చీరాల మండలం గవినివారిపాలెంలో ఉదయం కంప్యూటర్ ఆన్ చేయగా.. సాయంత్రం 4 వరకు పని చేయకపోవడం విశేషం. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఎదురుకావడంతో అధికారులు

27న మోటుపల్లి తీరానికి కేంద్ర బృందం రాక

ఈనాడు, బాపట్ల : ఏపీ సహా ఐదు రాష్ట్రాల్లో ఓడల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ఇటీవల కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో చినగంజాంకు ఈనెల 27న కేంద్రబృందం రానుంది. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయటానికి ఇక్కడకు రానుంది. రాష్ట్రంలో ఓడల తయారీ క్లస్టర్ ఏర్పాటుకు చిన్నగంజాం మండల పల్లెపాలెం నుంచి మోటుపల్లి వరకు సముద్రతీర ప్రాంతంలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములున్నాయి. భూసేకరణ కూడా ఇక్కడ సులభంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని అనువైనదిగా భావిస్తున్నారు. ఓడల తయారీ, మరమ్మతులు, నౌకాశ్రయం ఏర్పాటుకు 1200 ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రాథమికంగా అంచనావేశారు. ఆమేరకు రైతులను ఒప్పించి ఇప్పించడానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముందుకు రావడంతో క్లస్టర్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా రాష్ట్ర ప్రభుత్వం అంచనాకు వచ్చినట్లు తెలిసింది. మోటుపల్లి పక్కనే బకింగ్‌హామ్ కెనాల్ దానికి సమీపంగా సముద్రం ఉంది. ఓడల తయారీ కాగానే సముద్ర మార్గం ద్వారా ఆయా రాష్ట్రాలు, దేశాలకు తరలించటానికి అనువుగా ఉంటుందని, ఇక్కడ స్థల పరిశీలన చేయాలని ఎమ్మెల్యే ఏలూరి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి అభ్యర్థించారు. దీంతో ఆయన కూడా సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో చర్చలు జరిపి ఓ బృందాన్ని ఇక్కడకు పంపడానికి చొరవ తీసుకున్నట్లు తెలిసింది. ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలోనే 216 జాతీయ రహదారి ఉంది. ఒకవైపు రోడ్డు మలుపు, జలమార్గం ఉండటం.. ఇది అన్నింటికీ అనుకూలమైన ప్రాంతం. పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ఉండటం కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. దీని ఏర్పాటుతో స్థానికంగా పదివేల మందికి ఉపాధి లభ్యమవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.

సీనియారిటీ జాబితా విడుదల

గుంటూరు: వైద్య విధాన పరిషత్‌లో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఫార్మసీ అధికారుల సీనియారిటీ జాబితాను విడుదల చేస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర బుధవారం ఆదేశాలిచ్చారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పని చేస్తున్న 31 మంది వివరాలను ఈ జాబితాలో చేర్చారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈనెల 29వ తేదీ లోపు తెలియజేయాల్సిందిగా సూచించారు.

గృహిణులకు ఏటా రూ.89.35 కోట్ల లబ్ధి

బాపట్ల, న్యూస్‌టుడే

దీపావళి కానుకగా సూపర్‌సిక్స్ పథకంలో ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలెండర్లు మహిళలకు ఉచితంగా అందించే పథకాన్ని అమలు చేయాలని తెదేపా కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వంట గ్యాస్ సిలెండర్ బుక్ చేసుకున్న రెండ్రోజుల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో రూ.851 నగదును ప్రభుత్వం జమ చేస్తుంది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లకు రూ.2553 లబ్ధిదారులకు అందనున్నాయి. ఆ మేరకు ఒక్కో మహిళకు లబ్ధి చేకూరనున్నది.

జిల్లాలో ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. 25 ఏళ్ల క్రితం తెదేపా ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో మహిళలకు దీపం పథకం కింద 1.45 గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. తాజాగా తెదేపా కూటమి ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలెండర్ల పథకాన్ని అమలుకు సిద్ధమవుతుంది. అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి గ్యాస్ సిలెండర్లు బుక్ చేసుకున్న వారికి ఈ నెల 31న పథకాన్ని ప్రారంభించి దీపావళి కానుకగా అందజేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి ఏడాదికి మూడు సిలెండర్లు ఇవ్వడానికి షెడ్యూల్ ఖరారు చేశారు. ఏప్రిల్-జులై మధ్య మొదటి, ఆగస్టు-నవంబరు మధ్య రెండో, డిసెంబరు-మార్చి మధ్య మూడో సిలిండర్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు, గ్యాస్ కంపెనీల వారీగా కనెక్షన్లు, దీపం, ఉజ్వల కనెక్షన్లు, తెల్లరేషన్ కార్డుదారులు కలిగిన గ్యాస్ కనెక్షన్ల వివరాలను పౌరసరఫరాల అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు.



- జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు **4.31** లక్షలు
- దీపం పథకం కనెక్షన్లు: **1.45** లక్షలు
- ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్లు: **17** వేలు
- ఇవికాకుండా తెల్లరేషన్ కార్డు కలిగిన గ్యాస్ కనెక్షన్లు: **1.88** లక్షలు
- మొత్తం లబ్ధిదారులు: **3.50** లక్షలు
- లబ్ధిదారులకు ఏడాదికి కలగనున్న లబ్ధి: రూ. **89.34** కోట్లు

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : రేషన్ సరకులను అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఇ.బి.విలియమ్స్ సూచించారు. పట్టణ, మండల పరిధిలోని రేషన్ దుకాణ, సరకు రవాణాదారులతో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారు ఫణికుమార్ అధ్యక్షతన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీలోపు ఆయా రేషన్ డీలర్లు అర్హులకు అందించే పంచదార, కందిపప్పు, బియ్యానికి సంబంధించిన చలానా చెల్లించి గోదాముల నుంచి సరకులు పొందాలన్నారు. ఎప్పటికప్పుడు నిల్వల పట్టికలను నమోదు చేయటంతో పాటు సరకులు అందించే ఎండీయూ వాహనాలకు రోజుకు 100 నుంచి 150మంది లబ్ధిదారులకు సరకులు అందించేలా స్టాక్ ఇవ్వాలని సూచించారు. ఒక్కో ఎండీయూ వాహన పరిధిలో 4 నుంచి 5 రేషన్ దుకాణాలు ఉండటంతో సరకుల పంపిణీలో జాప్యం చేయరాదన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయం 6గంటల నుంచే పంపిణీ చేపట్టాలన్నారు. నూరు శాతం నిత్యావసర సరకులు పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అవకతవకలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు షేక్ సలీమా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న ఉద్యోగ మేళాలు

బాపట్ల, ఇంకొల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాపట్లలోని రక్షణ సైన్యం ఐటీఐ కళాశాల, ఇంకొల్లులోని డీసీఆర్ఎం (దగ్గుబాటి) విద్యాసంస్థలో ఈ నెల 25న ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ బాపట్లలో ఎస్‌బీఐ, డైకిన్, పెరల్ బేవరేజెస్, ఇంకొల్లులో ఐసీఐసీఐ బ్యాంకు, ఎక్స్ సొల్యూషన్స్, కర్ణాటక బ్యాంకు, సెలెక్ట్ గాడ్జెట్ స్టోర్ తదితర ప్రముఖ కంపెనీలు హాజరై నియామకాలు చేపడుతున్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎంబీఏ, పీజీ కోర్సులు చదివి 18 నుంచి 32 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగులు ఉద్యోగ మేళాకు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. రాత, మౌఖిక పరీక్షలో ప్రతిభ చూపిన వారికి విద్యార్హతను బట్టి నెలకు రూ.12 నుంచి 20 వేల వరకు వేతనం చెల్లిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొడవలికి పిడి అమరుస్తున్న మహిళ

కొడవళ్ల తయారీ కేంద్రంగా పేటేరు



● పలు రాష్ట్రాలకు ఎగుమతి ● కుటీర పరిశ్రమగా గుర్తించాలని వినతి

పేటేరు, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రేపల్లె మండలం పేటేరు కొడవళ్ల తయారీకి పేరుగాంచింది. గ్రామంలోని శ్రామిక నగర్‌లో 60 ఏళ్లుగా 40 కుటుంబాలకు కొడవళ్ల తయారీయే జీవనాధారం. వ్యవసాయ రంగంలో వరి, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి పంట కోతలకు అవసరమైన కొడవళ్లు తయారు చేయడంలో ఇక్కడి కార్మికులకు నైపుణ్యం ఉంది. కణకణలాడే అగ్ని కీలల నుంచి ఎగసిపడే నిప్పురవ్వలు.. లయబద్ధంగా సాగే సుత్తుల సవ్వడులు, బలమైన పిడికెళ్లు బిగించి మలాటుతో కార్మికులు తమ శక్తిని ఉపయోగిస్తుండగా వెలువడే ధ్వనులు అక్కడ నిత్యం వినిపిస్తుంటాయి. నాణ్యమైన కొడవళ్లు లభ్యం కావడంతో వాటిని కొనేందుకు పేటేరు గ్రామానికి వ్యాపారులు, రైతులు వస్తుంటారు.

ఇనుప బద్దలను కాల్చి..

ముడి ఇనుపబద్దలను కొలిమిలో కాల్చి కొడవలి ఆకృతిగా మలచిన అనంతరం దానికి సాన పట్టి నొక్కులు కొట్టి చెక్కి, పిడులు అమర్చే ప్రక్రియలో నిత్యం కార్మికులు శ్రమిస్తుంటారు. నాణ్యతను బట్టి ఒక్కో కొడవలి తయారీకి రూ. 40 నుంచి రూ. 140 మేరకు ఖర్చు అవుతోంది. ఒక్కో కొలిమి నుంచి రోజుకు 200 నుంచి 300 వరకు కొడవళ్లు తయారు చేస్తారు. జైపూర్, రంగు పిడి కొడవళ్లు, భేదు(రివిట్), బంద(రీల్) కత్తుల తయారీకి పేటేరు ప్రసిద్ధి గాంచింది. కొడవళ్ల తయారీకి అవసరమైన బేల్ బద్దలు చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటారు. ఇనుప బద్ద కాల్చేందుకు అవసరమైన బొగ్గు విజయవాడ, పిడి చెక్క స్థానిక కోత మిషన్ల నుంచి కొని తెచ్చుకుంటున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

పేటేరులో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన కొడవళ్లను కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్రంలో కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే వ్యాపారులు ఇక్కడ నుంచి అధిక మొత్తంలో కొడవళ్లు తీసుకెళ్తారు. ఏటా ఆగస్టు నుంచి మార్చి వరకు 40 కార్ఖానాల్లో (కొలిమిలు) నిత్యం 150కి పైగా కార్మికులు కొడవళ్ల తయారీలో శ్రమిస్తుంటారు. కొడవలి, కత్తుల నాణ్యత బట్టి రూ. 50 నుంచి రూ. 150 (హోల్‌సేల్), రూ. 100 నుంచి రూ. 300 వరకు (రిటైల్) విక్రయిస్తున్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన సాంకేతిక మార్పులతో వరి, మినుము, మొక్కజొన్న కోత యంత్రాలు రైతులకు అందుబాటులోకి వచ్చాక. ఈక్రమంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కోతకు యంత్రాలను అధికంగా వినియోగిస్తున్నారు. ఆ ప్రభావం కొడవళ్ల తయారీపై పడి కొంత డిమాండ్ తగ్గింది. దీంతో గతంలో కంటే కార్ఖానాల సంఖ్య కొంత తగ్గింది. ఏడాదిలో ఎనిమిది నెలలు మాత్రమే ఉపాధి దొరకడంతో కార్మికులు ఇతర పనులకు వెళ్తున్నారు. శ్రమకు తగ్గ ఫలితం రాక మరి కొంత మంది ఈ వృత్తికి దూరమవుతున్నారు.



పదును పెడుతున్న కార్మికులు

కుటీర పరిశ్రమగా గుర్తిస్తే మేలు

కొడవళ్ల తయారు చేసే కార్ఖానాలను ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తిస్తే మేలు జరుగుతుంది. పెట్టుబడి పెట్టి కొడవళ్లు తయారు చేసినా వాటిని కొనేవారు లేక భద్రపర్చే అవకాశం లేక అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం ఎక్కువ సార్లు తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. కుటీర పరిశ్రమగా గుర్తించి రాయితీపై రూ. 2 లక్షలు నుంచి రూ.3 లక్షల వరకు బ్యాంకు రుణం ఇవ్వాలి. తద్వారా ఎక్కువమంది ఔత్సాహికులు కొడవళ్ల తయారీకి ముందుకొచ్చే అవకాశం ఉంటుంది. దీంతో కొడవళ్ల తయారీ గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు గ్రామంలో మరికొంత మందికి ఉపాధి దొరుకుతుందని తయారీదారులు చెబుతున్నారు.

మూడు నెలల మగబిడ్డ రూ.లక్షకు విక్రయం

బాపట్ల, న్యూస్‌టుడే: ఓ మహిళ రూ.లక్ష నగదు కోసం కన్న ప్రేమను చంపుకుని మూడు నెలల పసిబిడ్డను విక్రయించిన వైనమిది. బిడ్డను కొనుగోలు చేసిన వారు పూర్తి స్థాయిలో నగదు చెల్లించక పోవటంతో ఈ అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది. బాపట్లలో ఇందిరానగర్ కాలనీకి చెందిన వెంకటేశ్వరమ్మ మూడు నెలల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. మూడు వారాల క్రితం ఆ బిడ్డకు రూ.లక్ష చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుని నెల్లూరు జిల్లా కావలికి చెందిన పేరం నాగమణి అనే మహిళకు విక్రయించింది. అయితే నాగమణి రూ.80 వేలు మాత్రమే చెల్లించింది. రూ.20 వేలు ఇవ్వలేదు. తనకు నగదు ఇవ్వకుండా నాగమణి మోసం చేసిందని పట్టణ పోలీసులకు వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు చేసింది. వారి దర్యాప్తులో పసిబిడ్డను నగదు కోసం కన్న తల్లే విక్రయించిన విషయం బయటపడింది. కావలి నుంచి మూడు నెలల పసిబిడ్డను బాపట్లకు తీసుకొచ్చిన పోలీసులు స్థానిక ఐసీడీఎస్ అధికారుల సంరక్షణకు అప్పగించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తం ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ అహ్మద్ జానీ బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు.



బాలల సదన్ నిర్వాహకులకు చిన్నారిని అప్పగిస్తున్న సీఐ

పేదలకు లబ్ధి చేకూర్చటమే లక్ష్యం కావాలి

బాపట్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. కేంద్ర బృందం సభ్యులు ఎస్.శ్రీరామ్, పి.లోహిత్‌రెడ్డి కలెక్టరేట్లో జేసీని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేంద్ర బృంద సభ్యులు మాట్లాడుతూ రేపల్లె, వేమూరు, సంతమాగులూరు మండలాల్లో ఈ నెల 26 వరకు పర్యటిస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలు వివరాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అనుబంధ శాఖల అధికారులతో జేసీ ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ జీవనోపాధుల కింద కేంద్ర ప్రభుత్వం 12 పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. నిరుపేదలకు ఉపాధి కల్పించి వారి జీవన స్థితిగతులను మెరుగుపరచాలన్నారు. కేంద్రం వెచ్చిస్తున్న నిధులు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరాలన్నారు. పథకాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు కేంద్ర బృందం ఈ నెల 26 వరకు మూడు మండలాల్లో పర్యటిస్తుందన్నారు. 13 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలిస్తారని తెలిపారు. డీఆర్వో సత్తిబాబు, డీఆర్డీఏ పీడీ పద్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీపీవో ప్రభాకర్, ఏపీడీ సువార్త తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బృంద అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

చీరాల ఏరియా వైద్యశాలలో కేంద్ర బృందం పరిశీలన

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల ఏరియా వైద్యశాలలో బుధవారం నేషనల్ హెల్త్ మిషన్ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వైద్యశాలలోని ఓపీ, ప్రసూతి, డయాలసిస్, రక్తనిధి విభాగాలను పరిశీలించారు. గర్భిణులకు అందించే వైద్యసేవలపై బృందం అడిషనల్ డైరెక్టర్ డాక్టరు వరుణ్ గైకే ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రక్తనిధిలో ఎక్కువ శాతం రక్తం వృధా అవుతోందని దీని నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు సహజ ప్రసవం చేయాలని, సిజేరియన్ల సంఖ్య తగ్గించాలని డాక్టర్లకు సూచించారు. డీసీహెచ్ఎస్ డాక్టరు శేషకుమార్, డీఐవో డాక్టరు వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ సుభాషిణి, వైద్యులు రోహిణీ రత్న, యాకోబు, డీపీవో ప్రేమ పావని, మలేరియా అధికారి శేషుబాబు ఉన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ల బృందం

ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక నేడు

బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14 బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహిస్తున్నట్లు పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి షేక్ కరీముల్లా తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపిన బాల, బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్టు నవంబరు 9 నుంచి 11 వరకు పిట్టలవానిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు.

అర్చక పరీక్షలకు దరఖాస్తు గడువు పెంపు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్వహించే అర్చక పరీక్షలకు దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పెంచినట్లు అర్చక సంఘ నాయకులు స్వర్ణ శ్రీనివాస శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈనెల 20న విజయవాడలో దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో అర్చక ఐక్యవేదిక ప్రతినిధుల వినతి మేరకు అధికారులు ఈ మేరకు గడువు పెంచుతూ నిర్ణయం తీసుకొన్నారని తెలిపారు. వేదవిద్య అభ్యసిస్తున్న 12 ఏళ్లు నిండిన పిల్లలు కూడా పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి 28న కౌన్సెలింగ్

నిజాంపట్నం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగో కౌన్సెలింగ్ అనంతరం ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుధాకరబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 28న వారికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో పనివేళల్లో లేదా 9849479424 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇద్దరు యువకుల ప్రాణాలు తీసిన క్వారీ గుంత

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు

కొటికలపూడి(అద్దంకి), న్యూస్‌టుడే : ఇటుకబట్టీల మట్టికోసం తవ్విన గుంత ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన బుధవారం బాపట్ల జిల్లా అద్దంకి మండలం కొటికలపూడిలో చోటు చేసుకుంది. పక్క పక్క ఇళ్లలో ఉండే ఇద్దరు యువకులు కాలేషా(18), అబ్దుల్లా(15) గేదెలు మేపేందుకు పొలానికి వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు పొలం వెళ్లిన గేదెలు ఇంటికి చేరాయి. వాటి వెంట వెళ్లిన యువకులు మాత్రం చీకటి పడే వరకు ఇంటికి రాలేదు. అనుమానించిన కాలేషా తండ్రి హిమాంసాహెబ్ అలియాస్ బుడే సాహెబ్ కుమారుడిని వెతుక్కుంటూ పాత కొటికలపూడి వైపు వెళ్లారు. మధ్యలో కనిపించిన ఇటుక బట్టీల కోసం తవ్విన క్వారీలో పైకి కనిపిస్తున్న వెంట్రుకలను చూసి చలించాడు. గుంతల్లో ఉన్న వ్యక్తిని బయటకు తీసి పరిశీలించగా యువకుడు తన కుమారుడు కాలేషా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. విషయం తెలిసిన గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన మరో యువకుడి కోసం గాలించారు. ఎక్కడా ఆచూకి లభించలేదు. అనుమానంతో అదే ఇటుకబట్టీ గుంతలో నిశితంగా పరిశీలించగా ఆచూకీ లభ్యమైంది. దీంతో ఆ యువకుడి మృతదేహాన్ని కూడా బయటకు తీశారు. మృతుడు కాలేషా తల్లి దండ్రులు హిమాంసాహెబ్-నాగూర్‌బీ కూలీ పనులు చేస్తుంటారు. రెండో యువకుడు అబ్దుల్లా తండ్రి కాలేషా ఏడు సంవత్సరాల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తల్లి రజియా కూలీపనులతో కుటుంబాన్ని పోషిస్తుంది. ఇద్దరు యువకులకు చెరొక సోదరి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల బంధువుల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.




కాలేషా, అబ్దుల్లా (పాతచిత్రాలు)

విషాదంలో కొటికలపూడి గ్రామం

ఇద్దరు యువకులు ఇటుకబట్టీ గుంతలోపడి మృతిచెందడంపై కొటికలపూడిలో విషాదంలో మునిగింది. ఇంటర్ వరకు చదివిన కాలేషా కుటుంబ అవసరాల నిమిత్తం బైకు మెకానిక్‌గా శిక్షణ పొందుతున్నాడు. రోజూ అద్దంకి వెళ్లే ఇతను అనుకోకుండా గేదెల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. ఇంటి పక్కనే ఉంటున్న అబ్దుల్లా తిమ్మాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి సరదాగా గేదెల వద్దకు వెళ్లారు. ఇదే వారి చివరిరోజు అవుతుందని ఎవరూ ఊహించలేదు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబాలను సర్పంచి పూనాటి విక్రం, స్థానిక నేతలు పరామర్శించారు.

మహిళ హత్య కేసు నిందితుడి అరెస్టు

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని డేగరమూడిలో మహిళను కత్తితో పొడిచి హత్యచేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మార్టూరు పట్టణ సీఐ మద్దినేని శేషగిరిరావు బుధవారం తెలిపారు. మార్టూరు స్టేషన్‌లో ఈ నెల 20న డేగరమూడికి చెందిన నాగండ్ల మేరిని కొరిశపాడు మండలం యర్రబాలేనికి చెందిన కండెవరప్రసాద్ కత్తితో పొడవడంతో ఆమె చికిత్సపొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. సీఐ వివరాల మేరకు.. రాజుపాలెం గ్రామానికి చెందిన మేరికి నాగేంద్రబాబుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహది. వీరికి ఇద్దరు సంతానం కాగా, భర్తతో దూరంగా ఉంటోంది. రెండేళ్ల క్రితం పొగాకు పనుల నిమిత్తం తల్లిదండ్రులతో కలిసి నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం డీసీ పల్లి గ్రామానికి వెళ్లగా అక్కడ కొరిసపాడు మండలం యర్రబాలేనికి చెందిన ప్రసాద్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. ఏడాదిగా కండే ప్రసాద్, మేరి వేరే ప్రాంతాలకు వెళ్లి సహజీవనం చేస్తున్నారని, రెండు నెలల క్రితం మృతురాలి తండ్రి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తరుణంలో ప్రసాద్‌ను వదిలేసి డేగరమూడిలోన తన తండ్రికి వైద్య సేవల నిమిత్తం ఇక్కడే ఉంటోంది. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులను వదిలేసి తన వద్దకు రావాలని, లేకుంటే చంపుతానని పలుమార్లు మృతురాలిని ప్రసాద్ బెదిరించాడు. 20వ తేదీ నిందితుడు డేగరమూడి వచ్చి మృతురాలితో గొడవపడ్డాడు. కోపంతో కళ్లలో కారంచల్లి తల, మెడ, వీపు, ఎడమ చేతిపై కత్తితో విచక్షణా రహితంగా నరికి పారిపోయాడు. అనంతరం చికిత్స పొందుతూ గుంటూరులో మరణించగా మృతురాలి తండ్రి సూరేపల్లి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తుండగా మేదరమెట్ల నుంచి తమ్మవరం గ్రామానికి వెళ్లే బస్‌షెల్టర్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి హత్యకు వినియోగించి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అద్దంకి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో ఒంగోలు జైలుకు తరలించారు. ఈ కేసులో ఎస్పీ తుషార్ డూడీ సూచనల మేరకు డీఎస్పీ జి.రామాంజనేయులు పర్యవేక్షణలో సీఐ శేషగిరిరావు, హెచ్‌సీ కోటేశ్వరరావు, సుబ్బారావు, గరత్‌మంతుడు, రమేష్‌లతో కలిసి నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శేషగిరిరావు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

భర్త వేధింపులపై ఫిర్యాదు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధిలో వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ తనను భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ వెదుళ్లపల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. జె.పంగులూరు మండలం కొండముది గ్రామానికి చెందిన తాము కుటుంబంతో సహా మూడేళ్ల క్రితం వెదుళ్లపల్లిలో టీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నామని, కొంతకాలంగా భర్త వేధించటంతో పాటు ఈనెల 8న రోకలితో దాడి చేసి గాయపరిచాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గోపయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్ల
•బాపట్ల •రేపల్లె •వేమూరు

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

కొల్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని వేమూరు సీఐ పి.వి.ఆంజనేయులు చెప్పారు. మండల పరిధిలోని అనంతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమ, నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. తోటి విద్యార్థులతో స్నేహభావం కలిగి ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలు ఎదురైనపుడు పోలీసులకు సమాచారం అందించాల్సిన విషయాలను వివరించారు. మహిళా పోలీస్ శివనాగిని, ఏఎస్ఎం కుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పలు కూడళ్లలో పోలీసులు బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ పలు వాహనాల ధ్రువీకరణపత్రాలను పరిశీలించి చోదకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, ముగ్గురు వ్యక్తులు బైకులపై ప్రయాణిస్తే కేసులు నమోదు చేయటంతో పాటు జరిమానా విధిస్తామని చెప్పారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. రోడ్డు భద్రత నియమ, నిబంధలను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 83738

? పట్టణంలోని 8వ వార్డు ఉప్పరపాలెంలో పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవటంతో నీరు వృథాగా పోతోంది. పరిసరాల్లో నీరు నిలిచి పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దోమల స్వైరవిహారంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.
- సుబ్బారావు, స్థానికుడు

✔ ఇంజినీరింగ్ సిబ్బందిని పంపి కుళాయిలకు ట్యాప్‌లు బిగించి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం.
- రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్
- న్యూస్‌టుడే, బాపట్ల

రద్దీ నియంత్రణ చర్యలేవి?


గడియార స్తంభం కూడలి వద్ద వాహనాల రద్దీ


ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాల్సిన కూడలి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. రథం బజారు, సూర్యలంక రోడ్డు, 216ఏ జాతీయ రహదారిని కలిపే గడియార స్తంభం కూడలి అత్యంత రద్దీగా ఉంటోంది. కొందరు తమ వాహనాలను కూడలి వద్ద నిలుపుతున్నారు. దీని వల్ల సాయంత్రం, రాత్రి సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కూడలికి నాలుగు వైపులా వాహనాలు ఆపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో ఎక్కువ రద్దీగా ఉండే ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు రెండున్నరేళ్లుగా ఉన్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయి. కూడలి వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి. పదుల సంఖ్యలో వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నియంత్రిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. ఈ దిశగా పురపాలక, రవాణా, పోలీసు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు చేయూత అభినందనీయం


బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, న్యూస్‌టుడే: వరద బాధితులకు దళిత బహుజన రీసోర్స్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. కొల్లూరు మండలం కిష్కింధపాలేనికి చెందిన 334మంది వరద బాధితులకు ఒక్కొక్కరికి రూ.3,609 చొప్పున, రూ. 12.05లక్షల సాయాన్ని డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరదలకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. వారిని ఓ వైపు ప్రభుత్వం ఆదుకుంటూనే, మరోవైపు స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలు అందిస్తుందని చెప్పారు కార్యక్రమంలో డీబీఆర్‌సీ డైరెక్టర్ దేవకుమార్, గ్రామ తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా రేపల్లె మండలంలోని బొబ్బర్లంక, చోడాయిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కైతేపల్లి, తుమ్మల, నిర్మల్‌నగర్, పోటుమెరక, గంగడిపాలెం, రాజుకాల్వ, మోళ్లగుంట, లంకెవానిదిబ్బ గ్రామాల్లో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ఇన్‌ఛార్జి డీఈ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్తు వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

చెరుకుపల్లిలో శిక్షణ తరగతులు

గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న గ్రామ కన్వీనర్లు, కో కన్వీనర్లకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. గుళ్లపల్లి ఆనందీశ్వరస్వామి ఆలయంలో నేతలతో ఆయన ఈ మేరకు బుధవారం సమావేశం నిర్వహించారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండల, గ్రామాలకు చెందిన కన్వీనర్లు, సహ కన్వీనర్లు పాల్గొనాలని కోరారు.

లాభనష్టాల గణనలో దిట్టలు

✤ ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు


ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బహుమతులు అందుకున్న విజేత విద్యార్థులు


శ్రీచైతన్య పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్, శ్రీచైతన్య ఉన్నత పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు బుధవారం జరిగాయి. పోటీల్లో భాగంగా 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశంపై ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలో విద్యార్థులు వి.నాగ తనూశ్రీ, బి.షైనీ, కె.జస్మిత వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి ఎ.సునీత, ఉపాధ్యాయిని దీపిక బహుమతులు ప్రదానం చేశారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో జరిగిన పోటీలో విద్యార్థులు ఎస్‌కే సోహ ప్రథమ, కె.పర్జన్య ద్వితీయ, జి.నిషాంత్ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల డీన్ బి.అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ ఎన్.వి.మాధురి, ఉపాధ్యాయులు ఎం.రవికుమార్, కె.ప్రియాంక బహుమతులు అందజేశారు.

సీఎం సహాయనిధితో మెరుగైన వైద్యం


బాధితురాలికి పత్రం అందిస్తున్న తెదేపా నేత శివప్రసాద్

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక 28వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న హేమ నాగశ్రీ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6 లక్షలకు ఎల్‌వోసీ పత్రాన్ని తెదేపా నేత శివప్రసాద్ అందించారు. రేపల్లెలో మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాసంలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతికి మెరుగైన వైద్యం చేయించాలన్నారు. నేతలు పంతాని మురళీధరరావు, నర్రా సుబ్బయ్య, పట్టాభి రామారావు పాల్గొన్నారు.

నగరంలో రెవెన్యూ సదస్సు

నగరం, న్యూస్‌టుడే: మండల కేంద్రం నగరంలో ఈనెల 24న రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాంచారయ్య తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వేలో జరిగిన లోపాలు, ఇతర భూ సంబంధ సమస్యలపై రైతులు అర్జీ దాఖలు చేసుకోవాలన్నారు.

త్వరితగతిన ఈకేవైసీ పూర్తిచేయండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల పరిధిలో లబ్ధిదారులైన గర్భవతులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్, ఫోన్ నంబర్లతో ఈకేవైసీ చేయాలని పల్లపట్ల సీడీపీవో అనసూయ సూచించారు. ఈకేవైసీ చేసే విధానంపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ స్వప్న, సెక్టార్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవోలు

నిజాంపట్నం, న్యూస్‌టుడే : మండలంలో కొమరవోలు ఉర్దూ, బావాజీపాలెం ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవో-1, 2) శోభాచంద్, శేషగోపాలం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను ప్రశ్నించి వారిలో విద్యాప్రమాణాల స్థాయిలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న తీరు, దస్త్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్నారు. బావాజీపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు.

బెజ్జం ఆశయ సాధనకు కృషి

బాపట్ల: పేదల సమస్యలపై సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నేత బెజ్జం శ్రీనివాసరావు అలుపెరగని పోరాటం చేశారని పార్టీ జిల్లా కార్యదర్శి విష్ణు, ప్రగతి మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి కల్పన అన్నారు. వెదుళ్లపల్లిలోని కొల్లా వెంకయ్య కాలనీలో శ్రీనివాసరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పీవోడబ్ల్యూ, అఖిల భారత రైతు కూలీ సంఘం, న్యూడెమొక్రసీ నేతలు పూలమాల వేసి నివాళి అర్పించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు అంకితభావంతో కృషి చేస్తామన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


చెరుకుపల్లి: పొలం గట్టు కింద ఎలుక నివారణ మందు పెడుతున్న ఏడీఏ ధనరాజు

రేపల్లె అర్బన్, బాపట్ల పట్టణం, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), కావూరు (చెరుకుపల్లి గ్రామీణ), కర్లపాలెం, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, నిజాంపట్నం, నగరం, న్యూస్‌టుడే: రైతులంతా సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అవలంబిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు. పంటలను నాశనం చేసే ఎలుకలను నిర్మూలించాలంటే సామూహిక నివారణ చర్యలు చేపడితేనే మేలన్నారు. ఆయా మండలాల్లో ఏర్పాటైన కార్యక్రమాల్లో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందు తయారీ చేసే విధానాన్ని వివరించి పంపిణీ చేశారు. పొలం గట్టుపై కలుపు మొక్కలు పెరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ఒక ప్రాంతంలో రైతులందరూ ఒకే సమయంలో వరి నాట్లు వేసేలా దృష్టి సారించాలి. పైరు తొలి దశలోనే ఎలుకల బోన్లు, బుట్టలు ఏర్పాటు చేసి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. బొరియల్లో ఊదర యంత్రాన్ని పొగబెట్టి చంపాలన్నారు. మూషికాలకు శత్రువైన గుడ్ల గూబలు పొలాల్లో వాలేలా పంగకర్రలు ఏర్పాటు చేస్తే రాత్రి వేళ సంచరించే ఎలుకలను వేటాడతాయని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు ఏడీఏలు, ఏవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా ఆయుష్ సేవలు దూరం

కనగాలలో మూతపడిన హోమియో వైద్యశాల


మూతపడిన కనగాల ప్రభుత్వ హోమియో వైద్యశాల

కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఏళ్లుగా సేవలందిస్తున్న హోమియో వైద్యశాలలు పాలకుల నిర్లక్ష్యానికి గురై చరిత్రలో కలిసిపోతున్నాయి. మండలంలో కనగాల పీహెచ్‌సీ ఆవరణలో 1980వ దశకంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన హోమియో వైద్యశాల ప్రజల ఆదరణ పొందింది. హోమియో మందులు, వైద్యుల కొరతతో ఇది క్రమేణా నిరాదరణకు గురైంది. దీంతో ఆరేళ్లుగా మూలకు చేరింది. ప్రస్తుతం దీన్ని పట్టించుకునే వారే లేక శిథిలావస్థకు చేరుతోంది. 2014-19 మధ్య తెదేపా పాలనలో ఇందులో వైద్యసేవలు నడిచాయి. వైకాపా ప్రభుత్వం కొలువుదీరాక దీని నిర్వహణను పూర్తిగా విస్మరించారు. దీంతో ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే ఇంగ్లిష్ మందులు వాడాల్సి వస్తోందని, ఇంటి వైద్యంలాంటి హోమియో సేవలు అందుబాటులో లేవని స్థానికులు విమర్శిస్తున్నారు.

సిబ్బంది కొరతే కారణం

ఈ హోమియో వైద్యశాలలో 2015-16 మధ్య పూర్తిస్థాయి వైద్య సేవలు అందాయి. అప్పుడున్న పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరడంతో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.1.95కోట్లతో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు జరిగే సమయంలో పీహెచ్‌సీ భవనం తొలగించడంతో ఈ హోమియో వైద్యశాలలోనే సాధారణ సేవలను కూడా అందించారు. 2018-19కి నూతన పీహెచ్‌సీ భవనం అందుబాటులోకి వచ్చింది. అప్పుడున్న సిబ్బంది ఉద్యోగ విరమణ చేయడం, కొందరు బదిలీపై వెళ్లడంతో ఈ హోమియో వైద్యశాల మూతపడింది. నూతన పీహెచ్‌సీ భవనం అందుబాటులోకి వచ్చినా సిబ్బంది లేకపోవడం, 2019లో కొలువైన వైకాపా ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ హోమియో వైద్యశాల పూర్తిగా మూతపడింది. అన్నివిధాలా ఉపయుక్తమైన భవనం కేవలం నిరాదరణకు గురై పాడవుతోంది. గడిచిన అయిదేళ్లలో పాలకుల నిర్లక్ష్యం వల్ల హోమియో సేవలు దూరమయ్యాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజారంజక పాలన సాగిస్తోంది. గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేస్తోంది. ఇందులో భాగంగా ఈ హోమియో వైద్యశాలను కూడా అందుబాటులోకి తీసుకొస్తుందని భావిస్తున్నాం. గతంలో నిత్యం వంద ఓపీ ఉండేది. తక్కువ ధరకు మంచి మందులు లభించేవి. ఇవి ఎటువంటి దుష్ప్రభావం చూపేవి కాదు. దీంతో ఎంతో ఆదరణ ఉండేది. తిరిగి హోమియో వైద్యశాలను గాడిన పెట్టాలని కోరుతున్నాం.
- ఎ.వెంకటేశ్వరరావు, కనగాల

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

నిజాంపట్నం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్సై కె.తిరుపతిరావు చెప్పారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు పోలీసుల త్యాగాలను నిజాంపట్నం కూడలిలో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రజలకు బుధవారం వివరించారు. అమరుల జీవితాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు తెలియచేయాలని సూచించారు. పలువురు పోలీస్ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

25న వ్యాసరచన పోటీలు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ఐక్యరాజ్య సమితి దినోత్సవం పురస్కరించుకొని చెరుకుపల్లి శాస్త్రి మెమోరియల్ ప్రాథమికోన్నత పాఠశాలలో మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు పవిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గొల్లపూడి సాంబశివరావు తెలిపారు. 6 నుంచి 9వ తరగతి పిల్లలకు విడివిడిగా పోటీలు జరుగుతాయన్నారు. సమితి ఆశయాలు, సాధించిన విజయాలు అంశంపై జరిగే పోటీల్లో ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

అయ్యప్పల సద్దికి మసీదు పెద్దల వితరణ

గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలో గుళ్లపల్లి శ్రీరామ మందిరం వద్ద అయ్యప్ప మాలధారులకు నిర్వహిస్తున్న సద్ది కార్యక్రమానికి గ్రామంలోని మక్కా మసీదు పెద్దలు బియ్యం, నూనె అందించారు. మసీదు పెద్దలు మీర్జా అజాముద్దీన్, షాజాద్, బాజీ, రఫీ తదితరులు రామాలయం వద్దకు వచ్చి 50 కిలోల బియ్యం, నూనె డబ్బాను నిర్వాహకులకు బుధవారం అందించారు. మసీదు పెద్దలను గ్రామస్థులు, నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో తెలుగు యువత నేతలు కాటూరి నాగేశ్వరరావు, కాటూరి ఏడుకొండలు, వంగర శ్రీనివాస చక్రవర్తి, వంగర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

నగరం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఈనెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. పిట్టలవానిపాలెం, జి.ఎన్.పాలెం, అల్లూరు గ్రామాల్లోని సంపద కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె సంజీవని ఎమర్జెన్సీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈనెల 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐఎంఏ, రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె శాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్యులు గుండె, ఎముకలు, నరాల సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారు.

డ్వాక్రా మహిళలకు రుణాలు

కారంచేడు(మార్టూరు): డ్వాక్రా మహిళలకు రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు బ్యాంకు రుణాలు పొందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఏపీఎం మోహనరావు తెలిపారు. బుధవారం మండలంలోని వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మెరుగైన సిబిల్ స్కోర్ ఉన్న మహిళలు వ్యాపారం చేసుకునేందుకు రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

మెగా జాబ్‌మేళా వేదిక మార్పు

అద్దంకి : నిపుణ సంస్థ సహకారంతో ఈనెల 29న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా వేదిక మార్పు చేసినట్లు పురపాలక కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. మొదట ర.భ.శాఖ అధీనంలోని బంగ్లా వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించామని, అయితే సరిపడా స్థలం లేనందున వేదిక మార్పు చేశామన్నారు. నాగులపాడురోడ్డులోని కామేపల్లి కల్యాణమండపం వద్ద జాబ్‌మేళా జరుగుతుందని ఆయన తెలిపారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

జే.పంగులూరు: జే పంగులూరు సచివాలయం పక్కన నివాసాల వెంబడి విషసర్పాలు సంచరించాయి. ఈ విషయమై ఈనాడు దినపత్రికలో బుధవారం 'మేమున్నాం మీకు తోడుగా'లో కథనం ప్రచురితమైంది. దీనికి గ్రామపంచాయతీ కార్యదర్శి బి.రాంబాబు స్పందించారు తక్షణం సిబ్బందితో ఇళ్ల వెంబడి చెత్త తొలగింపజేశారు.

బస్టాండ్ సమీపంలో ఆక్రమణలు తొలగించాలి

మేదరమెట్ల : మేదరమెట్ల బస్టాండ్ ముందు వైపు ఆక్రమించి నిర్మించుకున్న దుకాణాలు వెంటనే తొలగించాలని అద్దంకి ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు కోరారు. బుధవారం ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..గతంలో దుకాణాలు నిర్మించేందుకు టెండర్లను పిలిచామన్నారు. ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా తొలగించకపోతే యంత్రాలతో తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.మేదరమెట్ల పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఆయనతో ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? దేశాయిపేట పంచాయతీ ఆణుమల్లిపేటలోని మురుగు కాలువల్లో పూడికతీత పెరగడంతో మురుగు ముందుకు కదలడంలేదు. దుర్వాసన రావడంతో పాటు రాత్రులు దోమలు విజృంభిస్తున్నాయి. **-సుబ్బారావు, స్థానికుడు**

✔ వెంటనే ఆప్రాంతాన్ని పరిశీలించి పూడికతీత చేపడతాం **- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, దేశాయిపేట**

-న్యూస్‌టుడే, వేటపాలెం

? అద్దంకి పట్టణంలోని రామశాస్త్రివీధిలో నివాసముంటున్నాం. ఇటీవల అద్దంకి పట్టణంలో కొత్త విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ కారణంగా పాత వీధిదీపాలు తొలగించారు. కొత్తగా వేసిన విద్యుత్తు స్తంభాలకు దీపాలు వెలిగించలేదు. దసరా పండుగ నాటికి చీకట్లోనే ఉన్నాం. **- శ్రీరాం నాగేశ్వరరావు, అద్దంకి**

✔ క్లాంపులు మార్పు చేయాల్సి వస్తుంది. అందువల్ల ఆలస్యం అయింది. త్వరలో కొత్తవీధి దీపాలు వెలిగిస్తాం **- డీ.రవీంద్ర, కమిషనర్, అద్దంకి పురపాలక సంఘం**

-న్యూస్‌టుడే, అద్దంకి

? సోపిరాల ఆర్చి వద్ద సిమెంటు రోడ్డు పల్లంగా ఉంది. దీనిపై ఇటీవల కురిసిన వర్షపు నీరు చేరింది. రాకపోకలకు ఇబ్బందిగా కూడా ఉంది. సమస్యను పరిష్కరించండి. **-ఆర్.శ్రీనివాసరావు, స్థానికుడు, సోపిరాల**

✔ రోడ్డుపై చేరిన నీటిని వెంటనే బయటకు పంపి సమస్యను పరిష్కరిస్తాం **-పి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, చినగంజాం**

-న్యూస్‌టుడే, సోపిరాల(చినగంజాం)

పాలకులకు పట్టవు..

సమస్యలు తీరవు

అభివృద్ధికి ఆమడ దూరంలో ఈపూరుపాలెం పంచాయతీ

న్యూస్‌టుడే - చీరాల గ్రామీణం: అది జిల్లాలో అతి పెద్ద మేజర్ పంచాయతీల్లో ఒకటి. పేరుకు పెద్ద పంచాయతీ అయినా..ఇంతవరకు సొంత కార్యాలయం లేకపోవడం విశేషం. అదెక్కడో కాదు చీరాల మండలం ఈపూరుపాలెంలోనే. దశాబ్దాలుగా మౌలిక వసతులు లేక ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

✦ మార్కెట్ కూడలిలో ఆర్టీసీ బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. బాపట్ల, పొన్నూరు, గుంటూరు, రేపల్లె, విజయవాడకు వెళ్లేవారు ఎండలో, వర్షంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



పిల్లర్లతోనే ఆగిపోయిన పంచాయతీ కార్యాలయ భవనం

✦ గ్రామానికి పంచాయతీ భవనం లేకపోవడంతో దాన్ని అధికారులు నిర్మించ తలపెట్టి పిల్లర్ల స్థాయిలోనే నిలిపివేశారు. దీంతో పాత సర్కారు పాఠశాల భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

వెతలు ఇలా..

✦ మార్కెట్ కూడలిలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను 2019 ఎన్నికలకు ముందు కూలగొట్టి నూతనంగా నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ఇంతవరకు దాని ఊసే లేదు. కాంప్లెక్స్ భవనాల ద్వారా పంచాయతీకి ఏటా రూ.10 లక్షల మేర ఆదాయం వచ్చేది. గత ఆరేళ్లగా ఈ ఆదాయం కోల్పోవడంతో నెల నెలా సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితికి పంచాయతీ చేరింది.

✦ గ్రామంలో చాలా చోట్ల సరైన రహదారులు లేకపోవడంతో వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. జడ్పీ రహదారులైన ఈపూరుపాలెం బీఎస్ కాలనీ, మునుసూబ్ వీధి నుంచి రైల్వే గేటు మీదగా దరివాద పొలాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారయ్యాయి కొన్ని చోట్ల సగం సీసీ రహదారులు వేసి మిగిలిన భాగాలను పట్టించుకోవడం లేదు.

✦ కాంప్లెక్స్ పక్కనే ఉన్న కూరగాయల మార్కెట్‌ను తొలగించి కొత్తది నిర్మించినా..అందరికి న్యాయం జరగలేదని ప్రతినిధులు అంటున్నారు. దీంతో కొన్నేళ్లుగా మార్కెట్‌ను విస్తరించాలని కోరుతున్నారు.

✦ మండల ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే ప్రగడ కోటయ్య, గాంధీ పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. వీటి ప్రహరీ గోడలు కూలి రూపు రేఖలు కోల్పోయినా పరిశీలించిన నాథుడు లేడు.

✦ ప్రధాన రహదారిని విస్తరించి పటిష్టమైన రహదారిని నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించినా..నిధులు మంజూరు కావడం లేదు.

✦ రైల్వే స్టేషన్ అవతల ఉన్న మద్యం దుకాణాన్ని బార్‌గా మార్చడంతో ఆ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు చెప్పినా..ప్రయోజనం లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు.

✦ కుందేరు పక్కనే ఉన్నా..గ్రామంలో ఒక్క మురుగు నీటి పారుదల కాలువ లేకపోవడంతో వర్షాకాలంలో ఎక్కడి వరద నీరు అక్కడే ఆగిపోతోంది. కొందరు అభ్యంతరం తెలుపుతున్న కారణంగా మురుగునీటి కాల్వల ఏర్పాటుకు అధికారులు ఆలోచనలు చేయకపోవడంతో మొత్తం గ్రామానికే ఇబ్బందిగా మారింది.

చెక్‌డ్యామ్‌లో మొసలి ఉందంటూ కలకలం

మార్టూరు: మండలంలోని రాజుపాలెం చెక్‌డ్యాం వద్ద నీటిలో మొసలి కనిపించిందంటూ స్థానికులు వెల్లడించడంతో బుధవారం ఆ ప్రాంతమంతా కలకలం రేగింది. ఎప్పటిలానే పొలం పనులు ముగించుకుని వస్తున్న కొందరు రైతులు వాగుపై ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం వద్ద మొసలి కనిపించిందంటూ భయాందళనకు గురై మార్టూరు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన సీఐ మద్దినేని శేషగిరిరావు అటవీశాఖ అధికారులకు తెలపడంతో వారు రంగంలోకి దిగారు. దీనిపై ఆశాఖ బీట్ అధికారి రమేష్ గ్రామాల్లో దండోరా వేయించి గురువారం ఉదయాన్నే దానిని గుర్తించేందుకు చర్యలు చేపడతామని అప్పటివరకు రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

పర్చూరు(మార్టూరు): నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 25న ఇసుకదర్శి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. రెవెన్యూ పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తారని వెల్లడించారు.

పనిచేయని ఆధార్ సవరణ కేంద్రం

జే పంగులూరు : జే పంగులూరు ఒకటో సచివాలయం వద్ద బుధవారం ఆదార్ సవరణ చేస్తామని ప్రకటించారు. తీరా కంప్యూటరు మరమ్మతు కారణంగా సవరణ పనులు నిలిచాయి. దీంతో సచివాలయం వద్దకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి బి.రాంబాబు బూదవాడ సచివాలయం వద్ద ఆధార్‌కేంద్రం పనిచేస్తుందని వెల్లడించడంతో వారు అక్కడకు వెళ్లారు.

పోలీసుల సేవలు తెలుసుకోవాలి

రామ్‌నగర్(అద్దంకి) : పోలీసుశాఖ అందిస్తున్న సేవలు ప్రజలంతా తెలుసుకోవాలని సీఐ పి.కృష్ణయ్య అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్థానిక బెల్ అండ్ బెన్నెట్ పాఠశాల వద్ద బుధవారం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన కానిస్టేబుల్ లైలా తుపాన్ సమయంలో నల్లవాగు వద్ద జరిగిన ప్రమాదంలో తాను చనిపోతూ ఎంతోమందిని కాపాడారన్నారు. ఇలాంటి విషయాలు విద్యార్థులు తెలుసుకోవాలని ఎస్సై ఖాదర్‌భాషా అన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభల నిర్వహణ



చక్రాయపాలెం: వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్

వేటపాలెం, చీరాల గ్రామీణం, చక్రాయపాలెం(అద్దంకి),గొనసపూడి (చినగంజాం), గంగవరం (ఇంకొల్లు), పర్చూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పి.పార్వతి తెలిపారు. గ్రామంలో జరిగిన రీ-సర్వేపై అనుమానాలు, తప్పులు జరిగి ఉంటే వాటిని గ్రామసభ ద్వారా పరిష్కరించేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పేరాల ఉజులీపేట సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోపీకృష్ణ తెలిపారు. చక్రాయపాలెం సచివాలయం వద్ద నరసింహాపురం రెవెన్యూ గ్రామానికి సంబంధించి తహసీల్దారు జీ. శ్రీచర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి వెంబడి భూములు కోల్పోయిన వారికి నేటికీ పరిహారం ఇవ్వలేదని, ఈకారణంగా రహదారి నిర్మాణం నిలిచిపోయిందని గోపాలపురానికి చెందిన లింగయ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లారు, ఈ అంశానికి సంబంధించి ప్రభుత్వం త్వరలో పరిహారం సొమ్ము జిల్లా కలెక్టర్ ద్వారా అందించేందుకు ప్రయత్నిస్తుందని, అవి రాగానే పరిహారం అందిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. రీసర్వే ద్వారా వచ్చిన భూ సమస్యలను గ్రామసభల్లో పరిష్కరించుకోవాలని చినగంజాం తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. రీసర్వేలోని వచ్చిన భూ సమస్యల పరిష్కారాలకు సంబంధించి గొనసపూడిలో తహసీల్దార్ జె. ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. వివిధ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 105 అర్జీలు అందాయని తహీసల్దార్ తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గంగవరంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి నాలుగు వినతులు అందాయి.ప్రభుత్వం నిర్వహించిన రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్లు బ్రహ్మయ్య, రవికుమార్‌లు కోరారు. మార్టూరు నియోజకవర్గంలోని అడుసుమల్లి, గన్నవరం గ్రామాల్లో బుధవారం రీ-సర్వేపై తలెత్తిన సమస్యలను రైతుల నుంచి వినతుల రూపంలో స్వీకరించారు.

108లో ప్రసవం



బిడ్డను తల్లి బంధువుకు అప్పగిస్తున్న ఈఎంటీ రామకృష్ణ

వేటపాలెం, న్యూస్‌టుడే: చిన గంజాం మండలం పెదగంజానికి చెందిన తిరుపతమ్మ నిండు గర్భిణి కావడంతో బుధవారం ఉదయం ఆమెకు నొప్పులు వచ్చాయి. దీంతో బంధువులు 108కి సమాచారం అందించారు. ఆ సమయంలో వేటపాలెంలో ఉన్న వాహనం అక్కడకు వెళ్లి గర్భిణిని ఎక్కించుకుని ప్రకాశం జిల్లా ఒంగోలులోని మాతా శిశు సంరక్షణాలయానికి బయలు దేరింది. అయితే నాగులుప్పలపాడు దాటిన తరువాత ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో పండంటి మగబిడ్డకు అంబులెన్స్‌లో జన్మనిచ్చింది. ఈ సమయంలో ఆమెకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈఎంటీ రామకృష్ణ వైద్యసేవలు అందించారు. పుట్టిన బిడ్డతో పాటు బాలింతను ఒంగోలు ఎంసీహెచ్‌లో చేర్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్ మొక్కలు

బొమ్మనంపాడు (అద్దంకి), న్యూస్‌టుడే : న్యూట్రీ గార్డెన్ చెట్ల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించాలని కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి అన్నారు మండలంలోని బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో దానిమ్మ వంటి పోషకాలు కలిగిన మొక్కలు నాటారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు

చీరాల, న్యూస్‌టుడే : పద్నాలుగు ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం శిక్షకు గురవుతారని సహాయ కార్మికశాఖాధికారి రామకృష్ణ అన్నారు. చైల్డ్ లేబర్ రెస్క్యూ, రీహాబిలిటేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు హోటళ్లు, దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టుకొని వారి భవిష్యత్తు చెడగొట్టవద్దన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. షోడోస్ ప్రతినిధి రాజా సాల్మన్, అబ్రహం, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దుకాణం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

వ్యవసాయ కనెక్షన్ల ఏర్పాటుకు చొరవ



మాట్లాడుతున్న ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

వైదన(అద్దంకి), న్యూస్‌టుడే : వ్యవసాయ విద్యుత్తు కోసం దరఖాస్తు చేసిన వారికి కనెక్షన్లు విడుదల చేసినట్లు ఆ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. బల్లికురవ మండలం వైదన, ముక్తేశ్వరం గ్రామాల్లో బుధవారం రాత్రి స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. వైదన గ్రామంలో 29 వ్యవసాయ విద్యుత్తు సరఫరా కోసం 29 నియంత్రికలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా 109 మంది రైతులకు ప్రయోజనం సమకూరుతుందన్నారు సాధారణ పద్ధతుల్లో ఒక్కో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలంటే కనీసంగా రూ.1.40 లక్షలు ఖర్చు అవుతందని, అలాంటిది ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు గాను ఇలాంటి సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు.

చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందారు. ఈ ఘటన బుధవారం జాండ్రపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జాండ్రపేటకు చెందిన పృథ్వి సుబ్రహ్మణ్యం(65) మధ్యాహ్నం తన ఇంటి పెరటిలో ఉన్న జామ కాయలు కోయడానికి చెట్టు ఎక్కాడు. అయితే ప్రమాదవశాత్తు జారీ బండమీద పడడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల, అద్దంకి: ద్విచక్రవాహనం రహదారి మధ్యలోని డివైడర్ దిమ్మెను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన ఘటన అద్దంకి మండలం వెంకటాపురం సమీపంలోని జాతీయరహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నేలటూరు గ్రామానికి చెందిన ఊసురుపల్లి సురేష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రేణింగవరం వైపు నుంచి మేదరమెట్ల వస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి కిందపడిపోయాడు. ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్టూరు: మండలంలోని కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మోపెడ్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది.హైవే పోలీసుల వివరాల మేరకు.. యనమదన గ్రామానికి చెందిన పి.బాలకృష్ణ బొల్లాపల్లి టోల్‌ప్లాజా నుంచి మార్టూరువైపు టీవీఎస్ మోపెడ్‌పై ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టి వెళ్లిందన్నారు. గాయాలైన క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు హైవే పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో నగదు మాయం

అద్దంకి: అద్దంకి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్న రూ.2.30 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయం బుధవారం వెలుగు చూసింది. ఈ మేరకు ఆసుపత్రి యాజమాన్యం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానితులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల,బాలికల ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికకు హాజరైన విద్యార్థులు

జే పంగులూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-14, -17 ఖోఖో క్రీడాకారుల ఎంపిక జే పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణం వద్ద బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడాకారుల ఎంపికకు ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది హాజరయ్యారు. 200 మంది బాలురు, 150 మంది బాలికలు పాల్గొన్నారు. బాల,బాలికల అండర్-14, -17 విభాగాలుగా చేశారు. ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున నాలుగు జట్లకు 48 మందిని ఎంపిక చేశారు క్రీడాకారుల ఎంపికలో జిల్లా కార్యదర్శి బి.కాశీవిశ్వనాథరెడ్డి, పీడీలు కె.హనుమంతరావు, వి.రఘుబాబు, పీఈటీలు సావిత్రమ్మ, బి.రమాదేవితోపాటు ఖోఖో శిక్షకులు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అండర్-17 బాలుర జట్టు : పి.నవీన్, డి.వినయ్, ఎం.సాగర్‌నాయక్, పి.నరేష్, సీహెచ్.నాగవర్ధన్, పి.అభిలాష్, శర్వాజ్, మనోజ్, ఎం.అక్షయ్‌కుమార్, ఆంజనేయులు, రఘుపతి, నవనీత్‌కుమార్, రంగస్వామి, వెంకటరవీంద్ర, వి.నందకిషోర్, అనిల్‌కుమార్‌నాయక్, వి.నారాయణ, పి.మంత్రునాయక్, వి.గోపీకృష్ణారెడ్డి

అండర్-17బాలికల జట్టు : బి.కళ్యాణి, కె.వైష్ణవి, లక్ష్మీప్రసన్న ఎం.నాగేశ్వరి, ఎస్.భానుప్రియ, మానశ్రీ, హేమశ్రీ, నందినిరెడ్డి, యశస్విని, కృష్ణసరిత, వెంకటరజిత, లలితస్వామి, పావని, రవికుమారి, పావని, ఎన్.ఎస్.తిరుమల.

అండర్-14బాలుర జట్టు : వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సాగర్, విష్ణు, సందీప్, సుమంత్, వెంకటసాయి, యశ్వంత్‌కుమార్, మనోహరరెడ్డి ఆనంద్‌బాబు, లక్ష్మీనరసింహా, మణికంఠ, శాంతికుమార్, శివశంకర్, లక్ష్మీపూర్ణచంద్రరావు, విశ్వనాథ్, హేమంత్‌కుమార్, ఆంజనేయులు.

అండర్-14బాలికల జట్టు : హేమలత, నందిని, బాలభార్గవి, వైశాలి, శ్రీలక్ష్మి, పల్లవి, నీలిమ, వర్షిణి, అక్షయశ్రీ, గురవమ్మ, నాగమణిత, స్వాతి, అనిత, వైష్ణవి, మాధురి.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

సుబ్బారెడ్డిపాలెం (ఇంకొల్లు), ఏల్చూరు (సంతమాగులూరు), కారంచేడు, రామాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: రసాయన ఏరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వాడకం లాభదయకమని ఇంకొల్లు మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ రైతులకు సూచించారు బుధవారం సుబ్బారెడ్డిపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంతమాగులూరు మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఏల్చూరులో నిర్వహించారు. సస్యరక్షణ చర్యలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో సుధీర్‌బాబు తెలిపారు. కారంచేడు మండలంలోని ఆదిపూడి యర్రంవారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.మినుములో పల్లాకుతెగులు నివారించుకోవాలని ఏఓ వెంకటకృష్ణ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రామాయపాలెం, తిమ్మాయపాలెం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. బల్లికురవ మండలం కూకట్లపల్లి, గొర్రెపాడు ఏఓ ఎస్‌వీపీ.కుమారి పాల్గొన్నారు.

ఇంకొల్లు బస్‌స్టేషన్‌లో నిఘా పెంపు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. బుధవారం బస్‌స్టేషన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. ఎస్సై మాట్లాడుతూ ఇంకొల్లు నుంచి నిత్యం నాలుగు వేలమంది వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. వీరికి భద్రత కల్పించాల్సి బాధ్యత ఆర్టీసీ, పోలీసు వ్యవస్థలపై ఉందన్నారు. ప్రాంగణంలో అవసమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రాత్రి వేళల్లో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా విద్యుత్తు సౌకర్యం కలుగజేయాలన్నారు. బస్‌స్టేషన్‌లో దుకాణాల నిర్వాహకులు అసాంఘిక శక్తుల సంచారం పోలీసులకు అందజేయాలని సూచించారు. ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు మోహనకృష్ణ, కంట్రోలర్ బాబు, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాల నమోదు ప్రారంభం

జే.పంగులూరు, న్యూస్‌టుడే : భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలు నమోదుకు గ్రామాల్లో చర్యలు ప్రారంభమైనట్లు మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిషత్తు సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షత వహించారు. 11 గంటలకు జరగాల్సిన సమావేశానికి కోరంకు అవసరమైన సభ్యులు హాజరు కాకపోవటంతో 11.50 గంటలకు ప్రారంభమైంది. ఏవో మాట్లాడుతూ మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో మినుము పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఈ ఏడాది 29శాతం అదనపు వర్షపాతం నమోదైందన్నారు. ఉద్యాన శాఖాధికారి దీప్తి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాలకు మాత్రమే భారీగా రాయితీలు అందిస్తున్నట్లు వివరించారు. అన్ని గ్రామాల్లో రూ.3.33 కోట్ల ఉపాధిహామీ నిధులతో సిమెంటు రహదారులు నిర్మిస్తున్నామని పంచాయతీ రాజ్ ఏఈ హనుమంతరావు తెలిపారు.

మండల కేంద్రం.. అభివృద్ధి శూన్యం

జే పంగులూరులో ఇరుకు రహదారితో ఇబ్బందులు

జే పంగులూరు, న్యూస్‌టుడే : జిల్లాలో జే పంగులూరుకు ప్రత్యేకత ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఖోఖో క్రీడాకారులు ఇక్కడి నుంచే ఎక్కువ మంది ఎంపిక అవుతారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన రాజకీయ నేతలున్న గ్రామం. రాజకీయ, సామాజిక చైతన్యం అధికంగా ఉన్న గ్రామం. అయినా కష్టాలు మాత్రం మాత్రం అన్నిచోట్ల మాదిరిగా ఇక్కడ కూడా పెనవేసుకున్నాయి. సుమారు పది వేలమంది జనాభా ఉన్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవాలనుకునే అద్దంకి వాసులు ఇటువైపుగా ప్రయాణించాల్సిందే. జాతీయ రహదారి నుంచి ముప్పవరం మీదుగా జే పంగులూరు, ఇంకొల్లు, చీరాల నుంచి బాపట్ల చేరుకోవచ్చు. కానీ 100 అడుగుల వెడల్పు ఉండాల్సిన రహదారులు ఆక్రమణల కారణంగా బక్కచిక్కిపోయాయి. ఎదురుగా బస్సు వచ్చిందంటే చాలు మరో భారీ వాహనం వెళ్లే పరిస్థితి లేదు.

గతంలో రెండు వరుసల మార్గంగా విస్తరణకు ప్రయత్నం

మండలంలోని ముప్పవరం నుంచి ఇంకొల్లు వరకు రెండు వరసల రహదారికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో జే పంగులూరు మీదుగా విద్యుత్తు ఉపకేంద్రం నుంచి మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ కూడా ఇచ్చారు. తర్వాత వైకాపా ప్రభుత్వం ఏర్పాటుతో ఈ అంశం మరుగున పడింది. దీంతో ఆక్రమణదారులు మళ్లీ పుట్టుకొచ్చారు. ఆక్రమణలను తొలగిస్తూ, తిరిగి ఎవరూ హద్దులు దాటకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే ఆధార్ నవీకరణ కోసం మండల సరిహద్దులోని రామకూరు వెళ్లాల్సి వస్తుందని దాన్ని గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఇరుకుగా జే పంగులూరు కూడలి



గ్రామంలో అడుగడుగునా ఆక్రమణలు పెరిగాయి. వాటిని తొలగించే సాహసం అధికారులు, ప్రజాప్రతినిధులు చేపట్టలేక పోతున్నారు ఫలితంగా ఎదురెదురుగా లారీలు, బస్సులు ప్రయాణించే అవకాశం లేకుండా పోయింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ముప్పవరం నుంచి ఇంకొల్లుకు రెండు వరుసల రహదారిగా చేసేందుకు మార్కింగ్ ఇచ్చారు. అనంతరం అది ఆగిపోయింది. అది జరిగితే కొంత మేర రవాణా సమస్య తీరుతుంది.

- తల్లపనేని శ్రీనివాసరావు, చిరు వ్యాపారి, జే పంగులూరు

అటీ ఇటీ

సచివాలయ ఆకస్మిక తనిఖీ

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని కుంకులమర్రు, కారంచేడు గ్రామాల్లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను తహసీల్దార్ అనిత బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాలు, వివిధ కార్యాలయాలను సందర్శించి సిబ్బంది విధులను తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని తహసీల్దార్ కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

మార్టూరు: సమాజాన్ని పట్టిపీడిస్తున్న హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు అవగాహనతో మెలగాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కె.దుర్గ కోరారు. బుధవారం జొన్నతాళిలో దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2030 నాటికి ఈ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎయిడ్స్ రోగులకు అండగా నిలుస్తోందని తెలిపారు..

మెరుగైన పారిశుద్ధ్యమే ధ్యేయం

పర్చూరు(మార్టూరు): గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య కల్పించాలని పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని సర్వసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పర్చూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల వద్ద మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సభలో లేవనెత్తారు. ఎంపీపీ ఆనందకుమారి మాట్లాడుతూ గ్రామాల పారిశుద్ధ్యం మెరుగుకు అవసరమైన నిధులున్నాయని ప్రభుత్వం మంజూరుచేసిన సీసీ రోడ్లను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు.

మొక్కల సంరక్షణకు ట్రీ-గార్డులు ఏర్పాటు

మార్టూరు: రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద నాటిన మొక్కలకు ట్రీ-గార్డులను ఏర్పాటు చేసి వాటి సంరక్షణ బాధ్యతలను రోటరీ ప్రతినిధులు చేపట్టారు. ఎంఈవో వస్రాం నాయక్, రోటరీ మాజీ సహాయ గవర్నర్ ఇంటూరు ఆంజనేయులు, అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు, కోశాధికారి మాదాల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సముద్ర వేటలో జాగ్రత్తలు తీసుకోవాలి

చీరాల గ్రామీణం: మత్స్యకారులు సముద్ర వేటలో జాగ్రత్తలు పాటించాలని మత్స్యసహాయకులు సూచించారు. చీరాల మండలం వాడరేవు సచివాలయంలో బుధవారం మత్స్య సాగుబడి కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ..నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదు చేసుకోవడంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. సముద్ర వేటలో తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ఇతర సురక్షత సాధనాలు వెంట తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.

శారదాపీఠం భూముల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, అమరావతి: శారదాపీఠం భూముల్లో సాగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరం రూ.20 కోట్ల ధర పలికే భూమిని కేవలం రూ.లక్ష చొప్పున 15 ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. 'సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములను తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించుకునేందుకు అక్రమాలు చేశారు. వాటిని గుర్తించాం కాబట్టే లీజును రద్దు చేశాం. ఎర్రమట్టి దిబ్బలను సైతం గత పాలకులు కొల్లగొట్టారు. అక్రమాలన్నింటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

పట్టాలపై గంజాయి సేవనం..

రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి


కిరణ్‌కుమార్


యాసిన్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టాలపై కూర్చుని గంజాయి తీసుకుంటుండగా.. రైలు దూసుకురావడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కిరణ్‌కుమార్ (18), అదే పట్టణానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి యాసిన్ (17) మంగళవారం రాత్రి చిత్తూరు మార్గంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గంజాయి తీసుకోవడం మొదలుపెట్టారు. అదే సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబయి వెళ్లే రైలు వీరిపై నుంచి దూసుకెళ్లింది. గంజాయి మత్తులో రైలు వస్తున్న విషయాన్ని వారు గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. లోకో పైలట్ అందించిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా యాసిన్ చనిపోయి కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న కిరణ్‌కుమార్‌ను తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారని, వారి వద్ద గంజాయి పొట్లాలు దొరికాయని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యాసాగర్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 23న తనకు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. సాధ్యమైనంత త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.



ఇతరులు బాధపడతారని క్షమాపణ చెప్పొద్దు

మీరు తప్పు చేసినప్పుడే క్షమాపణ చెప్పండి. మీ కోసం తీసుకొనే నిర్ణయాలతో ఎదుటివారు బాధపడతారన్న ఆలోచనతో మాత్రం క్షమాపణ చెప్పకండి. అది వారి సమస్యే తప్ప మీది కాదు. మీరేదైనా కొత్తగా ప్రయత్నించి విఫలమైనప్పుడు, మీరేం కోరుకుంటున్నారో చెప్పినప్పుడు, మీ అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, కుటుంబంతో గడపడానికి పనికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు మీరు తప్పు చేసినట్లు కాదు. ఆ సందర్భాల్లో ఎవ్వరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు.

– డేనియల్ ఆరోన్, రచయిత

స్వామి అడుగులకు మడుగులు!

- భూముల కేటాయింపులో ఉల్లంఘనలు
- ట్రస్టీ పేరుతో అభ్యర్థన.. ఉత్తరాధికారి పేరుతో కేటాయింపులు
- నాటి వైకాపా పాలనలో సర్వం మాయ

ఈనాడు–అమరావతి, విశాఖపట్నం: వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదా పీఠానికి నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా వత్తాసు పలికింది. రూ.225 కోట్ల విలువచేసే 15 ఎకరాలను.. నిబంధనలు ఉల్లంఘించి రూ.15 లక్షలకు కట్టబెట్టారు. ఒకసారి ఉత్తరాధికారి, మరోసారి ట్రస్టీ పేరుతో వ్యవహారాలు నడిపి గందరగోళానికి తెరతీశారు. అభ్యర్థన ఒకరి పేరుతో రాగా.. కేటాయింపు మరొకరి పేరున జరిగింది. గత జులై 15న ముఖ్యమంత్రి చంద్రబాబు 'సహజ వనరుల దోపిడీ' పేరుతో విడుదల చేసిన శ్వేతపత్రంలో శారదా పీఠానికి కేటాయించిన భూముల వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తదుపరి చర్యల్లో భాగంగా కలెక్టర్ నుంచి అందిన నివేదికపై మంత్రివర్గంలో చర్చించి ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేసింది. భూముల కేటాయింపులో విశాఖ జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిన ప్రధాన ఉల్లంఘనలు ఇవీ..

★ నిబంధనల ప్రకారం ట్రస్టు నిర్వాహకులు, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేరున కాకుండా పీఠం ఉత్తరాధికారి పేరున ఆ భూములను బదలాయించకూడదు.

★ తొలుత 2.9.2021న పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి 15 ఎకరాలు కావాలని అభ్యర్థించారు. శాశ్వత బదలాయింపు కోసం ఉత్తరాధికారి ఫారం-29లో వివరాలు పూర్తిచేసి సమర్పించాల్సి ఉన్నా.. అవేమీ చేయలేదు.

★ అప్పటి ప్రభుత్వం స్వాత్మానందేంద్ర అభ్యర్థన మేరకు 24.10.2021లో భూములు బదలాయింపు జీఓ 571 ఇచ్చేసింది. ఆ తర్వాత పీఠం ట్రస్టీ చాగంటి ప్రకాశరావు ఫారం-29లో వివరాలు నింపి దరఖాస్తు చేశారు.

★ 29.11.2021న శారదా పీఠం ట్రస్టీ పేరున భూమిని బదలాయిస్తూ జీఓ 343ను ఇచ్చింది. వాస్తవానికి ఫారం-29 ఎవరు సమర్పిస్తారో వారి పేరున బదలాయించాలి. ఇక్కడ ట్రస్టీ చేయడంతో ఆయన పేరున జీఓ ఇచ్చారు. మొదట ఉత్తరాధికారి పేరున ఒక జీఓ ఇచ్చి, ట్రస్టీ పేరున మరొకటి విడుదల చేశారు.

★ తర్వాత భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా, సర్వే నంబర్లు మార్చి ఇవ్వాలని శారదా పీఠం ట్రస్టీ అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

★ వెంటనే రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములను ఒకే సర్వే నంబరు కింద మార్చి సవరించిన ఉత్తర్వులను ట్రస్టీ పేరున ఇచ్చారు. శాశ్వత బదలాయింపు ఉత్తర్వుల్లో స్వాత్మానందేంద్ర సరస్వతి పేరున ఇచ్చిన దాంట్లోనూ మార్చారు. 8.2.2022న నాటి ప్రభుత్వం 343 బదలాయింపు ఉత్తర్వులను సవరించి కొత్తగా శారదా పీఠం ఉత్తరాధికారి పేరున జీఓ 64ను కొత్తగా ఇచ్చింది. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరి పేరున నచ్చినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

★ 20.11.2023న ఆధ్యాత్మిక, ట్రస్టు అవసరాల కోసం ఈ భూమిని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. అందుకోసం అప్పటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పీఠం ఉత్తరాధికారి లేఖ రాశారు. వడ్డించే వాడు మనవాడైతే అన్నీ వస్తాయన్నట్లుగా ఒక రాయి వేశారు.


★ ఆ ప్రతిపాదించిన స్థలంలో ఘాట్ రోడ్డు నిర్మించేశారు. ప్రస్తుతం ఒక బోరు, షెడ్డు ఉంది.

రేపటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

జార్జియాలో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఆయా తేదీల్లో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలపై చర్చిస్తారు. ఇందులో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో 25న సమావేశమవుతారు. పత్ర సినర్జీస్, బోసన్, స్పాన్‌ఐఓ, క్లారిటీ, ఎడోబ్, స్కేలర్, జనరల్ అటామిక్స్ సంస్థల ప్రతినిధులు, భారత కాన్సుల్ జనరల్‌తో 26న భేటీ అవుతారు. ఆస్టిన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో 27న, రెడ్‌మండ్‌లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో 28న భేటీ కానున్నారు. 29న అమెజాన్ సహా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావడంతోపాటు ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ నెల 30న కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 31న జార్జియాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో నవంబరు 1న సమావేశమవుతారు.

పొట్ల కాదు వంకాయే!



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం సవరడ్డపనస గ్రామానికి చెందిన చీడి విశ్వప్రసాద్ ఇంటి ఆవరణలోని ఓ వంగ మొక్క అడుగున్నర పొడవైన కాయ కాసింది. కర్ణాటకకు చెందిన ఓ రైతు దేశీయ కూరగాయలు సాగు చేస్తున్నట్లు విశ్వప్రసాద్ యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నారు. ఆయన్నుంచి 'ఇల్లీకుంబన్ ఎగ్ ప్లాంట్' రకం విత్తనాలు కొని, పోస్టులో తెప్పించుకున్నారు. వాటిని సేంద్రియ విధానంలో పెంచగా పొడవైన కాయ కాసింది. కేరళకు చెందిన ఈ రకం వంగ సాధారణంగానే పొడవైన కాయలు ఇస్తుందని ఉద్యాన అధికారిణి మంగమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట



డ్రైవింగ్ లైసెన్స్‌లో అవయవదానం వివరాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్‌లో డ్రైవర్ వివరాలతో పాటు సామాజిక అంశాలకు కొత్తగా ప్రాధాన్యం ఇస్తున్నారు. డ్రైవర్ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, అర్హత పొందిన వాహనం స్వభావం వివరాలతో పాటు అవయవదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని ఐడీపైన ముద్రించారు. వీటితో పాటు డ్రైవర్ రక్త గ్రూపు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్, అర్హత పొందిన వాహనాల చిత్రాలనూ ముద్రించారు. దీనివల్ల ప్రమాదం జరిగిన సమయంలో సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రాజ్యలక్ష్మి దాతృత్వం ఆదర్శప్రాయం

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి


అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అయ్యప్పరాజుకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, సావిత్రమ్మ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్యాంకులో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్ట్లా రాజ్యలక్ష్మి దాతృత్వం అందరికీ ఆదర్శప్రాయమని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో నరసింహారెడ్డి చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు బుధవారం చెక్కులు అందజేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి ఆదర్శ నిర్ణయం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా అందరికీ మార్గదర్శిగా మిగిలిపోతారన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ చారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, శిర్డీ సాయి సేవా ట్రస్టుకు రూ.10 లక్షలు, శిష్ట్లా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటైన మెమోరియల్ ట్రస్టుకు రూ.36 లక్షలు (చెక్కుల రూపంలో) రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకట్‌లకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, జీఎస్టీ అధికారులు సీహెచ్. వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్. ఈశ్వర్, యుగంధర్, మూర్తి, పెంచల సంపం తఫ్సన వివేకానంద, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేయనున్నట్లు వెల్లడించారు. ట్రెండ్‌కు తగ్గట్లుగా నేత కార్మికులకు శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో బుధవారం వివిధ జిల్లాల డీడీలు, ఏడీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. 'చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. ప్రతిచోట నూతనంగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

వైకాపా హయాంలో.. రౌడీలను పెంచి పోషించారు

మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా హయాంలో గంజాయి సాగును నియంత్రించకపోగా, రౌడీమూకలను పెంచి పోషించారని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ప్రస్తుతం హత్యాచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక మత్తు పదార్థాల అమ్మకం, వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.

విశాఖ ఉక్కులో వీఆర్ఎస్ ప్రతిపాదన విరమించుకోవాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. "విశాఖ ఉక్కు కర్మాగారంలో సర్వే పేరుతో ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి సాగనంపడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఉద్యోగులందరూ వీఆర్ఎస్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాలి. కార్మికుల పోరాట ఫలితంగా రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ తెరుస్తున్న సమయంలో ఈ చర్య ఉత్పత్తిని దెబ్బతీయడమే. సెయిల్‌లో విలీనం చేయకుండా వీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టడాన్ని కార్మికులు ప్రతిఘటించాలి" అని సూచించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


ఆదిత్య సాయి

బాపట్ల, న్యూస్‌టుడే: నంద్యాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బాపట్ల లిటిల్ ఏంజెల్స్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి బి.ఆదిత్యసాయి విజేతగా నిలిచాడు. ఇతను తన ప్రతిభతో జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో జమ్మూకశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఆదిత్యసాయిని పాఠశాల ఎండీ జి.అభినవ్, ప్రిన్సిపల్ సెబాస్టియన్ అభినందించారు.

లోపాలపై అభ్యంతరాలు స్వీకరించాలి


వేమూరు: పోతుమర్రులో వివరాలు తెలుసుకుంటున్న రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి

వేమూరు, కొల్లూరు, అమృతలూరు, న్యూస్‌టుడే: రైతు సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే పూర్తి చేసిన చోట్ల గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రామలక్ష్మి పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. వేమూరు మండలం పోతుమర్రు, కొల్లూరు మండలం బొద్దులూరుపాడు, అమృతలూరు మండలం యలవర్రు గ్రామాల్లో భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ - పరిష్కార కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించారు. రీ-సర్వేలో జరిగిన లోపాలపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు సుశీల, వెంకటేశ్వరరావు, నెహ్రూబాబు, యలవర్రు సర్పంచి నాగేశ్వరావు, వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కొండచిలువ కలకలం


రోడ్డుపై తిరుగుతున్న కొండచిలువ

మేదరమెట్ల, అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి- మేదరమెట్ల గ్రామాల మధ్యలోని కొంగపాడు డొంక సమీపంలో నామ్ రహదారిపై బుధవారం రాత్రి కొండచిలువ తిరుగుతూ కలకలం రేపింది. ఆ దారిన వెళ్లే వాహన చోదకులు తమ వాహనాలను కొద్దిసేపు నిలిపివేశారు. సమీపంలోని పొలాల నుంచి వచ్చిన కొండ చిలువ రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. డివైడర్ వద్ద పైకి ఎక్కేందుకు ప్రయత్నించినా వీలు కుదరకపోవడంతో వెనక్కి తిరిగి పొలాల్లోకి వెళ్లింది. దీంతో నామ్ రహదారిపై కొద్ది సేపు రవాణా నిలిచిపోయింది.

అయిదు కి.మీ.. అష్టకష్టాలే


ఛిద్రమైన తెనాలి-చందోలు రహదారి

అమృతలూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తెనాలి - బాపట్ల జిల్లా చందోలు మార్గంలో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో కూచిపూడి నుంచి పెదపూడి వంతెన వరకు గుంతలతో నిండింది. వైకాపా అయిదేళ్ల పాలనలో రహదారి అభివృద్ధికి నోచుకోక ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత పాడైంది. సుమారు అయిదు కిలోమీటర్ల మేర రహదారి గుంతలతో నిండింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధం



మాట్లాడుతున్న ఏఐఆర్ఆర్‌బీఈఏ నేత వెంకటేశ్వరరెడ్డి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధమవుతుందని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్స్ ఉద్యోగుల సంఘ నేత ఎస్.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని వెంకటేష్ గ్రాండ్‌లో బుధవారం ఏఐఆర్ఆర్‌బీఈఏ సమావేశం జరిగింది. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ క్రమంలో కేంద్రం గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు ముందుకు రానుందన్నారు. ఏఐఆర్ఆర్‌బీఈఏ కృషితో వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఇతర అలవెన్సులు కూడా సాధించామన్నారు. తొలుత చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును సంఘ నేతలు సందర్శించి బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సీజీజీబీ అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి బోడా శ్రీనివాసరావు, అధ్యక్షుడు సీహెచ్. వెంకట్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ మజీద్, సీజీజీబీ స్టాఫ్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్.యమలయ్య, కోశాధికారి మూర్తి, అధ్యక్షుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో కాలనీలు


- అధ్వాన పారిశుద్ధ్యం
- దెబ్బతిన్న అంతర్గత రహదారులు
- పార్కుల్లో కొరవడిన పచ్చదనం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో పలు కాలనీల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్గత రహదారులు దెబ్బతిని గోతులతో నిండాయి. సిమెంటు కాలువల నిర్వహణ సరిగా లేక రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిలిచి పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మట్టి రహదారులు నీటితో చిత్తడిగా మారి, పిచ్చిమొక్కలు పెరిగి రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఉద్యానవనాల నిర్వహణ సరిగా లేదు. పచ్చదనం కొరవడింది. కుళాయిల ద్వారా నీరు సరిగా అందటం లేదు. ప్రధాన రహదారులపై యథేచ్ఛగా ఆవులు సంచరిస్తూ వాహనదారులను భయపెడుతున్నాయి.


రామకృష్ణ సేవా సమితి వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

డంపింగ్ యార్డులా పార్కు

సూర్యలంక రోడ్డులో రాజశేఖరరావుపేట సమీపంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద పదుల సంఖ్యలో ఆవులు యథేచ్ఛగా రోడ్లపై సంచరిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఆవులను ఢీకొని కింద పడి తీవ్రంగా గాయపడుతున్నారు. గతంలో ఆవును ఢీకొని పలువురు మృత్యువాత పడ్డారు. కార్లు అదుపు తప్పి పక్కకు దూసుకుపోతున్నాయి. శ్రీనగర్ కాలనీలో పురపాలక పార్కును అయిదేళ్ల వైకాపా పాలనలో ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. పిచ్చిమొక్కలు పెరిగి పార్కు అధ్వానంగా ఉంది. వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా మారింది. వివేకానందకాలనీ పార్కు అభివృద్ధిని విస్మరించారు.


రాజశేఖరరావుపేట వద్ద సూర్యలంక రహదారిపై ఆవులు


శ్రీనగర్ కాలనీలో అధ్వానంగా పార్కు

దోమల ఉత్పత్తి కేంద్రాలా?


- విజయలక్ష్మీపురం, ఇస్లాంపేట, నరాలశెట్టివారిపాలెం, వివేకానందకాలనీ, మున్నంవారిపాలెం, శృంగారపురం, బెస్తపాలెం, డీఎంపల్లి, హయ్యర్‌నగర్, కొత్తపేట, జగన్నాథపురం, దర్శిపెదమస్తాన్‌నగర్‌లో అంతర్గత సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయి. గోతులు పడి వాహనదారుల ఒళ్లు హూనమవుతోంది. రహదారులకు అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సి ఉంది. సిమెంటు కాలువలు అనుసంధానం కాకపోవటం, నీటిపారుదల లేక వర్షం కురిస్తే నీరు రోడ్లపై ఉండిపోతుంది. ఖాళీస్థలాలు చిట్టడవుల్లా మారి పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. వర్షపు నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. త్యాగరాయనగర్‌లో రెండు వీధుల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. చెంగల్రాయతోటలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.


డ్రైవర్స్‌కాలనీలోని ఓ ఖాళీ స్థలంలో మురుగు

అయిదు రోజులకోసారి నీరు

కుళాయిలకు నీరు సక్రమంగా అందటం లేదు. పెయింటర్స్, డ్రైవర్స్‌కాలనీకి అయిదు రోజులకోసారి మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీరు పంపిస్తున్నారు. బాలకృష్ణాపురం, దరివాదకొత్తపాలెం, కంకటపాలెం రైల్వేగేటు రోడ్డులో వారానికి ఒకసారి కూడా ట్యాంకర్ల ద్వారా నీరందక స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బేతనీకాలనీ ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మిస్తే ఈ ప్రాంత వాసులకు కుళాయిల ద్వారా నీరు అందుతుంది.

అమృత్ అవార్డు గ్రహీత మృతి


శ్రీమన్నారాయణ (పాత చిత్రం)

బాపట్ల, న్యూస్‌టుడే : బాపట్లకు చెందిన కూచిపూడి నాట్య కళాకారుడు మహంకాళి శ్రీమన్నారాయణ (84) పట్టణంలోని తూర్పుసత్రం వద్ద గల నివాసంలో బుధవారం మృతిచెందారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆరు నెలల క్రితం శ్రీమన్నారాయణకు అమృత అవార్డు ప్రదానం చేసింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ చేతులమీదుగా దీనిని అందుకున్నారు. కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన సత్యనారాయణ, కామాక్షమ్మలకు శ్రీమన్నారాయణ జన్మించారు. బాల్యం నుంచి నాట్యంపై ఎంతో మక్కువతో చిన్నతనంలోనే ప్రహ్లాదునిగా అద్భుతమైన ప్రదర్శనలు చేశారు. 18వ ఏట బాపట్లకు వచ్చి స్థిరపడ్డ ఆయన శ్రీకృష్ణుడిగా, సూత్రధారిగా, మాతంగ కన్యలుగా, శ్రీ సత్య హరిశ్చంద్రంలో లోహితాక్షుడుగా అంచెలంచెలుగా యక్షగాన చక్రవర్తిగా పేరు పొందారు. కూచిపూడి నాట్యకళలో దాదాపు 30వేల మందికి పైగా శిష్యులను తయారు చేశారు. ఆయన శిష్యురాలైన రమాదేవి హైదరాబాద్ కేంద్రంగా కూచిపూడి నాట్య అకాడమీ స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష సేవలందిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా పెద్దకుమారుడు వెంకటరామకృష్ణ కూచిపూడి నాట్యంలో పలు ప్రదర్శనలు చేశారు. చిన్నకుమారుడు సత్యనారాయణ 2017లో మృతి చెందారు. ఆయన భార్య శ్రీరామలక్ష్మి 2006లో కన్నుమూశారు. అద్భుతమైన కళాకారుడి మృతి కళారంగానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని నిరసన


కొల్లూరులో రాస్తారోకో చేస్తున్న స్థానికులు

కొల్లూరు, న్యూస్‌టుడే: తమ నివాస ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ పలువురు తెనాలి-వెల్లటూరు ఆర్అండ్‌బీ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం కొల్లూరు మండలంలో మద్యం దుకాణం అనుమతి దక్కించుకున్న ఓ వ్యాపారి స్థానిక బీసీ కాలనీలో దుకాణం నెలకొల్పాడు. విషయం తెలుసుకున్న మహిళలు, పురుషులు నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న వేమూరు సీఐ వీరాంజనేయులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రాస్తారోకో విరమించాలని, తరవాత దుకాణ నిర్వాహకుడితో మాట్లాడదామని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు సీఐ మాటలను పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న ఆబ్కారీ శాఖ సీఐ రవి రాస్తారోకో చేస్తున్న ప్రాంతానికి వచ్చి, ప్రస్తుతానికి దుకాణంలో అమ్మకాలు నిలుపుదల చేస్తున్నామని, దుకాణం షట్టర్లు మూయించారు. దీంతో నిరసనకారులు ఆందోళనను విరమించారు. రెండు గంటలకుపైగా రాస్తారోకో జరగడంతో తెనాలి నుంచి వెల్లటూరు వైపు వెళ్లేవారు, రేపల్లె నుంచి తెనాలి వైపునకు వచ్చేవారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రధాన రహదారికి రెండు వైపులా కిలోమీటరు పైగా దూరం వాహనాలు నిలిచిపోయాయి.